# మ్యూచివల్ ట్రాన్స్‌ఫర్

'సార్' చైతన్య పిలుపుకు గుర్రుగా చూశాడు విష్ణువర్ధన్.

"ఇది నా బదలీ దరఖాస్తు. దయచేసి త్వరగా హెడ్డాఫీసుకు పంపండి".

అంతవరకు కొరకొరలాడే విష్ణువర్ధన్ మొహం ఒక్కసారిగా ప్రసన్నమైంది.

"మొన్నటివరకు మ్యూచువల్ మాటెత్తితే మొహం ముడుచుకునేవాడివి, ఉన్నట్లుండి ఇలా మారిపోయావేం?" అడిగాడు నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

"అప్పుడలా అనుకున్నాను. ఇప్పుడిలా నిర్ణయించుకున్నాను".

"గుడ్... రేపే మహేష్‌ని రప్పిస్తాను. దీని మీద అతడి సంతకం కూడా కాగానే పైకి ఫర్వార్డ్ చేస్తాను".

"థ్యాంక్స్".

చైతన్య వెళ్ళిపోయాడు. అతడిచ్చిన దరఖాస్తును ఒకటికి పదిసార్లు పరీక్షగా చూశాడు విష్ణువర్ధన్. లాట్రీలో పదిలక్షలు తగిలినంత సంబరంగా ఉందతడికి. తన మిత్రుడు మహేష్‌ని ఈ బ్రాంచికి రప్పించుకోడానికి మార్గం సుగమం కావడమే అందుక్కారణం. పైగా అతడు తన ఆధీనంలో పనిచేస్తాడు. వాడి ముందు తన దర్పాన్ని ప్రదర్శించుకోవడానికి అవకాశమేర్పడటంతో ఎంతో సంతోషంగా ఉందతడికి.

విష్ణువర్ధన్, మహేష్ కాలేజీలో స్నేహితులు. ఇద్దరి అభిరుచులు ఒకటే కావడం వల్ల ఇట్టే కలిసిపోయారు. మధ్యాహ్నం క్లాసు లెగ్గొట్టి మ్యాట్నీలకెళ్ళాలన్నా, పట్టుదలగా గంటల తరబడి చదవాలన్నా వాళ్ళకే చెల్లింది.

పట్టభద్రులవుతూనే పోటీపరీక్షలకు పోటీపడ్డారు. గ్రూప్ వన్‌లో ఎంపికైన విష్ణువర్ధన్ ఆఫీసరైతే, మహేష్ గ్రూప్ త్రీలో సెలక్టయి గుమస్తా అయ్యాడు. డిపార్టుమెంటు ఒకటే అయినా ఇరువురికీ వేర్వేరు చోట్ల పోస్టింగ్స్ వచ్చాయి. ఉద్యోగాల్లో చేరి ఎనిమిదేళ్ళవుతోంది. ట్రాన్స్‌ఫర్ల మీద ఊర్లు మారారు. ఆతర్వాత ఎవరు ఎక్కడున్నది తెలిసిరాలేదు. మొన్న ఈ మధ్య ఇద్దరూ ఓ మ్యారేజి ఫంక్షన్‌లో కలుసుకున్నారు. కౌగిలించుకున్నారు. బాల్యచేష్టల్ని, జ్ఞాపకాల్ని మననం చేసుకున్నారు.

ఇరువురూ సరిసమానంగా పెరిగినా తను ఇప్పుడో మెట్టుపైన ఉన్నందుకు ఒక్కింత గర్వంగా ఉంది విష్ణువర్ధన్‌కి. ఆప్తమిత్రుడు ఆఫీసరయినా తనని మరచిపోనందుకు మహాసంతోషంగా ఉంది మహేష్‌కి.

"ఎవరికీ అందకుండా అంత దూరంలో అఘోరించకపోతే మా బ్రాంచికి వచ్చేయరాదూ" అన్నాడు విష్ణువర్ధన్.

"మనం అనుకుంటే సరిపోతుందా, నా పోస్టు అక్కడ ఖాళీగా ఉండొద్దూ"

"అడ్డుంటే తొలగిస్తాం"

"అది నాకు నచ్చదు. నా మూలంగా మీ ఆఫీసులో ఓ ఉద్యోగి తన అభీష్టానికి వ్యతిరేకంగా బదలీ కావడం నేను ఒప్పుకోను. పైగా అలా జరగడం అంత తేలికా కాదు"

"పోనీ ఒక పని చేస్తే"

ఏమిటన్నట్లు కళ్ళు పెద్దవి చేశాడు మహేష్.

"మీరిద్దరూ మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకోండి"

"అందుకు అతడు ఇష్టపడాలి కదా"

అదంతా నాకు వదిలేయ్. ఇంతకీ నీకు రావాలని ఉందా? లేదా? ముందామాట చెప్పు"

"ఓకే. అతడిని అడిగి చూడు"

"అలాగే అతడు ఊఁ అంటే నీకు ఫోను చేస్తాను. సరేనా?"

విష్ణువర్ధన్ ఆఫీసులో అడుగుపెడుతూనే చైతన్యని పిలిచి అతడి అభిప్రాయాన్ని కనుక్కున్నాడు.

"మీ మాట కాదంటున్నందుకు మన్నించండి. నేను అంతదూరం వెళ్ళలేను. నా మాతృమూర్తి గడపదాటే స్థితిలో లేదు. ఆవిడకు నేను తప్ప వేరే దిక్కులేదు. అన్నయ్య ఉన్నాడన్నమాటేగాని వాడికి సరైన ఉద్యోగం అంటూ ఏదీలేదు. వాడి సంసారభారాన్ని నేనే మోస్తున్నాను. ఇక్కడ నాకో స్వంత గూడు ఉండటంవల్ల అద్దెబాధ తప్పింది. ఆ డబ్బులు వాడికోసం వెచ్చించగలుగుతున్నాను. ఉన్నపళంగా నేనెక్కడికైనా వెళ్ళిపోతే వాళ్ళు అనాథలైపోతారు" అంటూ తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

వళ్ళు మండింది విష్ణువర్ధన్‌కి. తన మాటకి సై అంటాడే తప్ప ఇలా తన బాధల్ని ఏకరవు పెడతాడనుకోలేదు.

అంతే, ఆ రోజులగాయతూ చైతన్యకి కష్టాలు ప్రారంభమయ్యాయి.

ఆఫీసుకు ఏ మాత్రం ఆలస్యమైనా మెమో ఇస్తాడు. ఫైలు రాసి పట్టికెళితే మొహాన విసిరి కొడతాడు. స్వంత ఇంట్లో ఉండటం వల్ల హెచ్.ఆర్.ఎ.కి ఎలిజిబిలిటీ లేదన్నాడు.

ఓసారి తన భార్య నొప్పులుపడుతోందని సెలవివ్వమని అడిగితే "నువ్వు గాని పురుడు పోస్తావా? అంటూ వెటకారమాడాడు. లీవ్ మాత్రం శాంక్షన్ చేయలేదు. ఎప్పుడు ఇంక్రిమెంటు ఊసెత్తినా గుర్రుమంటాడు. అడ్వాన్సు అడిగితే లేదు పొమ్మంటాడు. అందరి ముందు అవమానపరిచి ఆనందిస్తాడు. పెదవి విప్పితే చార్జిషీటు అంటాడు.

చైతన్యని సమర్థిస్తే బాస్ దృష్టిలో తామెక్కడ చెడ్డ అయిపోతామేమోనని స్టాఫ్ ఎవ్వరూ నోరు మెదపడం లేదు.

ఇది ఇండివిడ్యువల్ కేసు అంటూ యూనియన్లేవీ పట్టించుకోవడం మానివేసాయి. ఎంత రాత్రి అయినా చైతన్యని పని పూర్తిచేసి మరీ వెళ్ళమంటాడు.

భార్యాబిడ్డల్ని చూసుకోడానికి అవడంలేదు. తల్లిని డాక్టరుకి చూపిద్దామంటే తీరిక

దొరకడంలేదు. తనొక యంత్రమై పోయాడు. అది ఆగాలన్నా, పనిచేయాలన్నా రిమోట్ బాస్ చేతిలో వుంది. అదెప్పుడూ ఆన్‌లోనే ఉంటుంది. ఇహ అక్కడ పనిచేయలేక అడవిలోకైనా పోతే బాగుంటుందనిపించింది. అందుకే మ్యూచువల్ దరఖాస్తు రాసిచ్చాడు. తననీ బందిఖానా నుండి త్వరగా విముక్తి చేయమంటోందతడి మనస్సు.

తన పథకం పారినందుకు చాలా సంతోషంగా ఉంది విష్ణువర్ధన్‌కి. ఉన్నపళంగా బయలుదేరి రమ్మని మహేష్‌కి ఫోన్ చేశాడు.

మహేష్ విష్ణువర్ధన్ ఇంటికి వెళ్ళకుండా నేరుగా ఆఫీసు కొచ్చాడు.

ఇక మహేష్ ఎప్పటికీ తన దగ్గరే పని చేస్తాడు. అనుక్షణం మిత్రుడి ముందు తన ఔన్నత్యాన్ని చాటుకోవచ్చు. ఆనందంలో విష్ణువర్ధన్ నోటినుండి మాటలు ఊడిపడటం లేదు.

"ఫోను చేసావని వచ్చాను. అర్జంటు పనేమైనా ఉందా?" అడిగాడు మహేష్.

"అవేం మాటలురా నీమ్యూచువల్ కోసం నేనెన్ని తంటాలు పడ్డానో నీకేం తెలుసు. మొత్తానికి ఎలాగైతేనేం ఒప్పుకున్నాడు. సరే, అవన్నీ ఇప్పుడెందుకులే. ముందు దీనిమీద సైన్ చేయి." అన్నాడు విష్ణువర్ధన్ డ్రాయర్లోంచి కాగితాన్ని బయటకు తీసి.

"సారి. నాకీ ట్రాన్స్‌ఫర్ వద్దు"

ఊహించని ఆ జవాబుకు అవాక్కయిపోయాడు విష్ణువర్ధన్. క్వశ్చన్ మార్కు అయిందతడి ఫేసు.

"నన్నిక్కడికి రప్పించుకోవడం కోసం చైతన్యని ఎన్ని ఇబ్బందులకు గురి చేసావో తెలిసింది. నిన్నిప్పుడు నా స్నేహితుడనుకోడానికి కూడా మనస్కరించటంలేదు. నీ దగ్గర ఊడిగం చేసే బదులు ఉద్యోగానికి రాజీనామా చేయటం ఉత్తమం. బై..." అంటూ సుడిగాలిలా బయటకు వెళ్ళిపోయాడు మహేశ్.

మిత్రుడి మాటలు విష్ణువర్ధన్ గుండెల్లో ఈటెల్లా గుచ్చుకున్నాయి.

ఆ సమయంలో చైతన్య అక్కడే ఉన్నాడు. స్టాఫంతా కిటికీలోంచి తొంగి చూస్తున్నారు. పిచ్చెక్కినట్టైంది విష్ణువర్ధన్‌కి. అవమాన బారంతో కుంచించుకుపోయాడు. గాలివానలా ఛిద్రమైపోయిందతడి అంతరంగం.

వెంటనే పెన్ను తీసి తనే ట్రాన్స్‌ఫర్‌కి దరఖాస్తు చేసుకున్నాడు.

**(8 ఆగష్టు ఆంధ్రప్రభ డైలి ఆదివారం అనుబంధం)**